నక్కలగండి కాలువకు మోక్షమెన్నడో?

• అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు • రిజర్వాయర్ నిండినా ప్రయోజనం శూన్యం

నెల్లూరు, ప్రకాశం జిల్లాల సరిహద్దున ఉండే నక్కలగండి రిజర్వాయర్ కాలువ, తూము పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అదే విధంగా కాలువలో కంపచెట్లు, పూడిక నిండి పోయింది. ఫలితంగా రైతులకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది.



మరమ్మతులకు గురైన తూము, గేటు



నక్కలగండి రిజర్వాయర్

వరికుంటపాడు: నక్కలగండి రిజర్వాయర్ కింద నాలుగు వేల ఎకరాలకు పారుదల ఉంది. ఈ జలాశయానికి రెండు కాలువలు ఉన్నాయి. తూర్పు కాలువ కింద జంగాలపల్లి, పోతవరం, వెంగమాంబపురం, వేంపాడు, తిమ్మారెడ్డిపల్లి, రామాపురం, తూర్పుకొండారెడ్డిపల్లి వరకు పారుదల ఉండగా, ఉత్తర కాలువ కింద కోడిగుడ్లపురం, పోతవరం వరకు పారుదల ఉంది.

గత ప్రభుత్వంలో నిధుల మంజూరు

2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో వర్షాలు లేక జలాశయం ఎండిపోయింది. 2019– 2024 వరకు వర్షాలు సంవృద్ధిగా కురవడంతో రిజర్వాయర్ నిండింది. అయినప్పటికీ ఈ నీటి ద్వారా జంగాలపల్లి, కోడిగుడ్లపాడు రెండు పంచాయతీలు మాత్రమే వరి, మెట్టపైర్లు సాగు చేశారు. గత ప్రభుత్వంలో నిధులు మంజూరు చేయడంతో తూర్పు కాలువకు కాంక్రీటు పనులు చేశారు. జంగాలపల్లి నుంచి పోతవరం వరకు పాత తూములు తీసివేసి కొత్త తూములు, పెద్ద పైపులు ఏర్పాటు చేశారు. అయితే తలుపులు పెట్టలేదు. తరువాత పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. కాలువల్లో కంపచెట్లు, పూడికతో నిండిపోయింది. ఫలితంగా జలాశయం నీరు కాలువలకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. కొంతమంది జలాశయం నీటిని వాగులకు వదిలి చేపలు పట్టుకుంటున్నారు. రిజర్వాయర్లో పుష్కలంగా నీరు నిలువ ఉంటే పాములూరు, గోపాలపురం, కొండారెడ్డిపల్లి, వగ్గంపల్లి భూగర్భ జలాలు పెరిగి బోర్ల నీరు బాగా ఉంటుంది. రిజర్వాయర్ కాలువ తూములు సరి చేసి తలుపులు పెట్టాలి. కాలువలో ఉన్న పూడికను, చెట్లను తీయిస్తే రైతులకు ఎంతో లబ్ధి చేకూరుతుంది.

కాలువలను బాగు చేయించాలి



నక్కలగండి ఆయకట్టు కింద అర ఎకరా సొంత పొలం, మరో ఎకరా కౌలుకు తీసుకున్న పొలం ఉంది. కాలువ ద్వారా సక్రమంగా నీరు రావడం లేదు. కాలువలో ఉన్న చెట్లు, పూడికను తొలగించాలి. తూములకు తలుపులు ఏర్పాటు చేయాలి.

– **నూతలపాటి లక్ష్మణ, వెంగమాంబపురం, వరికుంటపాడు మండలం**

వెంటనే పూర్తి చేయాలి



రిజర్వాయర్ పరిధిలో ఐదెకరాల సాగు భూమి ఉంది. 15 ఏళ్లగా కాలువల ద్వారా సరిగ్గా నీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. గత ప్రభుత్వంలో కొంతమేర పనులు జరిగాయి. ప్రస్తుతం అవి నిలిచిపోయాయి. వెంటనే కాలువ పనులు పూర్తి చేసి నీటిని అందించాలి.

– **ఎర్రగూటి మాలకొండారెడ్డి, తూర్పుకొండారెడ్డి, వరికుంటపాడు మండలం**

చెట్ల తొలగింపు పనులు చేస్తున్నాం

నక్కలగండి రిజర్వాయర్‌కు గతంలో నాబార్డు నిధులు రూ.4.50 లక్షలు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఆ నిధులతో తిమ్మారెడ్డిపాళెం నుంచి రామాపురం వరకు కాలువకు పూడికతీత, చెట్ల తొలగింపు పనులు చేపడుతున్నాం. రిజర్వాయర్ పరిస్థితి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం.

– **రమేష్, ఇరిగేషన్ ఇన్‌చార్జి ఏఈ, వరికుంటపాడు**

క్లుప్తంగా

ఎంపీడీఓ తనిఖీ



సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీడీఓ

వరికుంటపాడు: మండలంలోని తూర్పుబోయమడుగుల పంచాయతీలో ఎంపీడీఓ గోపి శ్రీనివాస్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలు, శానిటేషన్, విద్యుత్ లైట్లు పగలు వెలగడం తదితరాలను గుర్తించారు. అనంతరం సచివాలయానికి వెళ్లి ఉద్యోగులు సమయపాలన పాటించాలని సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వర్షాలు పడే సమయంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు పిల్లలు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి చిలకపాటి వెంకటేశ్వర్లు ఉన్నారు.

భగవద్గీత శ్లోకాల పోటీలు



దుత్తలూరు: కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మండలంలోని విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలు మంగళవారం నిర్వహించారు. మండల కేంద్రమైన దుత్తలూరు సెంటర్‌లో త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేకాలంకరణ చేపట్టి పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కాగా పోటీల విజేతలకు 21వ తేదీ బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



ఉదయగిరి రూరల్: ఉదయగిరి పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద ఉన్న వలస వ్యాపారులకు మంగళవారం అప్పసముద్రం ఆరోగ్య సహాయకుడు మన్సూర్‌అలీ నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఎన్టీఆర్ జిల్లా నూజివీడు నుంచి ఐదు కుటుంబాలు ఇనుప మంచాలు, కుర్చీలు అల్లి అమ్ముకునేందుకు వారం రోజుల క్రితం ఇక్కడికి వచ్చారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వ్యాపారం లేక పూట గడవక, ఉండేందుకు చోటు లేక సిమెంట్ నీటిపైపుల్లో పెద్దలు, చిన్నారులు, చలికి వణుకుతూ కాలం గడుపుతున్నారు. విషయం తెలుసుకున్న మన్సూర్ అలీ ముందుకొచ్చి బియ్యం, పప్పు దినుసులు, కూరగాయలు అందించారు.

ఆర్డీఓ సందర్శన



గిరిజనులతో మాట్లాడుతున్న ఆర్డీఓ పావని

సోమశిల: అనంతసాగరం మండల పరిధిలోని పడమటి కంభంపాడు గ్రామ సమీపంలో ఉత్తర కాలువ వద్ద నివాసముంటున్న గిరిజన కాలనీని ఆర్డీఓ భూమిరెడ్డి పావని మంగళవారం సందర్శించారు. ఇటీవల కాలనీకి చెందిన సుమారు 20 కుటుంబాల వారు సిమెంట్ రోడ్లు, తాగునీటి వసతి, విద్యుత్ సదుపాయం, గృహాలు లేవనే సమస్యలపై కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ క్రమంలో ఆయన ఆదేశాల మేరకు సంబంధిత అధికారులతో కలిసి ఆర్డీఓ కాలనీని పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ జయవర్ధన్, డీటీ నాగలక్ష్మి, విద్యుత్ శాఖ ఏఈ సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చిన్నబయ్య, పంచాయితీరాజ్ ఏఈ సాంబశివారెడ్డి, వీఆర్వో కోటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ సాయి తదితరులు ఉన్నారు.

వీరాంజనేయునికి విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్‌లో కొలువైన వీర అభయాంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. హనుమజ్జయంతి అయిన 13 మంగళవారాల తర్వాత గౌడ్ సేవా సంఘం ఉభయకర్తలుగా వ్యవహరించి పూజలను నిర్వహించారు. ఉదయం దేవస్థానంలో అభిషేకాలు, ఆకుపూజ, అష్టోత్తర పూజలు జరిపించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారికి పల్లకిసేవ, వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

ఎడ్ల బండలాగుడు పోటీలు రేపు

కలిగిరి: మండలంలోని పోలంపాడు గ్రామంలో పోలేరమ్మ తల్లి తిరునాళ్ల ముగింపు సందర్భంగా గురువారం జిల్లా స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. విజేత ఎడ్లకు ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, తర్వాతి స్థానాల్లో నిలిచిన ఎడ్లకు రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు అందజేస్తున్నట్లు వివరించారు. పూర్తి వివరాలకు 94415 24436 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత



ఆత్మకూరు: ఇద్దరు పేద ఇంజినీరింగ్ విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ డాక్టర్ వింగ్ జిల్లా అధ్యక్షుడు, దొరసానమ్మ మెమోరియల్ ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ జె.ప్రణీత్ ఆర్థిక సాయం అందజేశారు. సువ్వారుపాడు గ్రామానికి చెందిన పత్తిపాటి నందిని, పి.చక్రధర్ అనే విద్యార్థులను ఆత్మకూరులోని తన కార్యాలయానికి పిలిపించుకుని రూ.15 వేలు చొప్పున మంగళవారం అందజేశారు. దొడ్ల హరికృష్ణ, ట్రస్ట్ సభ్యులు డాక్టర్ వెంకట సందీప్, డాక్టర్ కుమార్, తోడేటి అశోక్ తదితరులు ఉన్నారు.

స్మార్ట్ మీటర్ల రద్దుకు ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

ఉదయగిరి రూరల్: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని సీపీఎం, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని లింగమనేనిపల్లెలో మంగళవారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ వ్యవసాయ పంపుసెట్ల మోటార్లకు మీటర్లు పెట్టే విధానం రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. స్మార్ట్ మీటర్ల విధానాన్ని అన్ని రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నా ఏపీలో అమలు చేయడం దారుణంగా ఉందన్నారు. దీని ద్వారా విద్యుత్ బిల్లు అధిక మొత్తంలో వస్తాయన్నారు. ఫలితంగా రైతులు ఇక్కట్లు పడుతారన్నారు. ఎన్నికలకు ముందు మంత్రి లోకేశ్ స్మార్ట్ మీటర్లను పగలగొట్టమని చెప్పారని, ప్రస్తుతం అదానీ కంపెనీకి లాభం చేకూర్చే విధంగా ప్రభుత్వం, పాలకులు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలన్నారు. ప్రభుత్వం పునరాలోచించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులందరికీ సరిపడా యూరియాను ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా సరఫరా చేయాలన్నారు. యూరియా అందుబాటులో లేక ఇప్పటికే అనేక మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల రద్దు, యూరియా సరఫరా చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి



ఉదయగిరి రూరల్: మండలంలోని ద్విచక్ర వాహనదారులు డ్రైవింగ్ సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం గండిపాళెం మార్గం వైపు వెళ్లే హైవే సర్కిల్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని, హెల్మెట్ ధరించిన వారిని గుర్తించి ఫైన్ విధించారు.

21న స్పెషల్ గ్రీవెన్స్ డే

మర్రిపాడు: ఈనెల 21న కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో భూ సమస్యలు, ఇతర సమస్యలపై స్పెషల్ గ్రీవెన్స్ డే జరుగుతుందని మర్రిపాడు తహసీల్దార్ అనిల్‌కుమార్ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యాయం చేయాలని విజ్ఞప్తి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పంచాయతీలోని ఎస్టీ కాలనీకి చెందిన కొంతమంది గిరిజనులు తమ భూములు తమకే దక్కేలా న్యాయం చేయాలని తహసీల్దార్ హమీద్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సర్వే నంబరు 839లో 197 ఎకరాల భూమి ఉందని, ఈ భూములు కొంతమంది గిరిజనులకు పట్టాలు మంజూరు చేయడంతో అందరం సాగు చేసుకుంటున్నామని తెలిపారు. తమకు తెలియకుండానే రెవెన్యూ అధికారులు పట్టాలు రద్దు చేసి ప్రభుత్వ భూమిగా మార్చడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియజేసి న్యాయం చేయాలని కోరారు. ఎంపీటీసీ భవానితో పాటు పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల రక్షణకు వినతి



వింజమూరు(ఉదయగిరి): మండలంలోని శంఖవరం పంచాయతీలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు రక్షించాలని గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ హమీద్‌కు ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పూర్తిస్థాయిలో సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని కోరారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు

ఉదయగిరి రూరల్: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ–1 టి.వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన మంగళవారం పట్టణంలోని ఎస్సీ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల పఠనా సామర్థ్యాలు పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిలో పఠనాసక్తిని పెంపొందించాలన్నారు. సులభరీతిలో విద్యాబోధన చేయాలన్నారు. ప్రతిరోజూ నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఖాదర్‌బాషా, ఉపాధ్యాయుడు నసీం అక్తర్ పాల్గొన్నారు.

ఈ–పంట నమోదును వేగవంతం చేయాలి



వింజమూరులో మాట్లాడుతున్న డీఏఓ సత్యవాణి



ఆత్మకూరురూరల్: మహిమలూరులో పీఎండీఎస్ కిట్ల పంపిణీ

వింజమూరు(ఉదయగిరి): జిల్లాలో సాగులో ఉన్న పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారిణి(డీఏఓ) సత్యవాణి తెలిపారు. వింజమూరులోని రైతుసేవా కేంద్రంలో సబ్‌డివిజన్ పరిధిలోని వ్యవసాయ సహాయకులకు శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో రైతుసేవా కేంద్రాల్లో సిబ్బంది ఉంటూ ఎప్పటికప్పుడు పంటల సాగుకు సంబంధించిన సూచనలు, సలహాలు అందించాలన్నారు. అన్నదాత సుఖీభవ రానివారు ఈనెల 20వ తేదీలోపు గ్రీవెన్స్‌సెల్‌లో అర్జీలు నమోదు చేసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ కింద 4,190 మంది రైతులకు నగదు వారి ఖాతాల్లో జమ అయ్యాయని, రానివారికి కూడా త్వరలో వస్తుందని చెప్పారు. రైతులకు సబ్సిడీపై జింక్ సల్ఫేట్ సరఫరా చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. వ్యవసాయ సాగు విధానం, నూతన పద్ధతులు, అధిక దిగుబడులు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏడీఏ శేషగిరిరావు, ఏఓలు వాసు, జలీల్ శ్రీవాణి, శ్రీహరి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

• **ఆత్మకూరురూరల్:** మండలంలోని మహిమలూరులో ఆత్మ, జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో ఖరీఫ్ పంటల సాగుపై మంగళవారం రైతులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. జిల్లా వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ మధుసూదన్ వరిలో ఆశిస్తున్న పలు రకాల కీటకాలు, తెగుళ్లు, వాటి నివారణ గురించి వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్త వినీత సమగ్ర ఎరువుల యాజమాన్యంపై సూచనలు చేశారు. మండల వ్యవసాయాధికారి కిశోర్‌బాబు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలు అందని రైతులు బుధవారంలోగా రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్వారా పీఎండీఎస్ కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శివజ్యోతి, ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ సురేఖ, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మారుతీదేవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటలక్ష్మి, సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్, వీఏఏ శ్రీహరి పాల్గొన్నారు.

• **సంగం:** మండలంలోని పడమటిపాళెంలో ఆత్మ వారి సౌజన్యంతో రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోవూరు ఏడీఏ అనిత వరిలో, వేరుశనగ పంటల సస్యరక్షణ పద్ధతులు, ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం, కలుపు నివారణ చర్యల గురించి వివరించారు. అనంతరం వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలతో కలిసి వరి పొలాలను పరిశీలించారు. ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త వినీత, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త శివజ్యోతి, డీఆర్‌సీ ఏడీఏ మారుతీదేవి, కీటక శాస్త్రవేత్తలు సురేఖాదేవి, మధుసూదన్‌లు రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం మండల వ్యవసాయాధికారి శశిధర్ మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ గీతాప్రసూన, గ్రామ రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



సంగం: పడమటిపాళెంలో..

పారిశుద్ధ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎంపీపీ సంపూర్ణమ్మ

సోమశిల: గ్రామాల్లో పరిశుద్ధ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ అన్నారు. అనంతసాగరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని, దోమల బెడద లేకుండా చూడాలన్నారు. కాలువల్లో బ్లీచింగ్ చల్లుతూ, మురుగునీరు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంఈఓ–2 ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో పెరిగిన విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని, మండలంలో 34 మంది ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. కాగా గౌరవరంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాలు ప్రధాన రహదారి మార్జిన్‌లో ఉన్నాయని, దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని.. జగనన్న కాలనీలో స్తంభాలు వేసినా ఇంతవరకు విద్యుద్దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ సభ్యుడు కాలువ నరసింహులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పలు శాఖల అధికారులు వారి అజెండాలను వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, వైస్ ఎంపీపీలు అల్లంపాటి సుధాకర్‌రెడ్డి, పాశెం శ్రీనివాసులు, కో–ఆప్షన్ సభ్యుడు కరీమొద్దీన్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్‌పై స్పెషల్ డ్రైవ్



చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

వరికుంటపాడు: మండలంలోని వరికుంటపాడు, బోయమడుగుల, రామాపురం, సాతువారిపల్లి, తూర్పురొంపిదొడ్ల పంచాయతీల పరిధిలో మంగళవారం ప్రత్యేక వ్యాక్సినేషన్ డ్రైవ్ నిర్వహించారు. వరికుంటపాడు జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ పద్మజ పరిశీలించారు. 5–7 ఏళ్ల మధ్య పిల్లలకు డీపీటీ, 10–16 ఏళ్ల పిల్లలకు టీడీ వ్యాక్సిన్ ఇచ్చారు. తరువాత స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించి రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి కేటాయించిన టార్గెట్లను సమయానికి పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాజశేఖర్, డాక్టర్ ఆయేషా, సువార్తమ్మ, వెంకటయ్య, జానకి పాల్గొన్నారు.

• **ఉదయగిరి:** పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాలలో జరుగుతున్న ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మంగళవారం మండల వైద్యాధికారిణి శివకల్పన, సీహెచ్ఓ శివకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఐదు నుంచి ఏడేళ్లలోపు చిన్నారులకు డీపీటీ, 10 నుంచి 16 ఏళ్లలోపు వారికి డీటీ వ్యాక్సిన్ వేస్తున్నామన్నారు. అనంతరం టీకాలు వేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ భవన ధ్వంసంపై విచారణ



విచారణ చేపడుతున్న ఎంపీడీఓ

కావలి (జలదంకి): కావలి మండలం చలంచర్ల గ్రామంలో పంచాయతీ భవనం ధ్వంసంపై కావలి ఎంపీడీఓ శ్రీదేవి మంగళవారం విచారణ చేపట్టారు. సుమారు 25 ఏళ్ల క్రితం నిర్మించిన భవనంలో సగభాగాన్ని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు. దీంతో గ్రామస్తులు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు ఎంపీడీఓ గ్రామంలోని సచివాలయంలో విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులు మాట్లాడుతూ అధికారం ఉంది కదా అని పంచాయతీ భవనాన్ని వారు తాము చెప్పిందే వేదమన్నట్లు ధ్వంసం చేశారన్నారు. అయితే భవనం ధ్వంసం చేసిన వారు మాత్రం పంచాయతీ భవనం పక్కనే రాములవారి గుడి నిర్మాణం జరుగుతుందని, గుడి ప్రయోజనార్థం వాడుకలో లేని సగభాగం భవనాన్ని తొలగించామని ఎంపీడీఓ దృష్టికి తెచ్చారు. దీనిపై ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వానికి చెందిన భవనాలు అధికారుల అనుమతితో పాటు పంచాయతీ తీర్మానాల అనుమతితో తొలగించుకోవాలని సూచించారు. ఇకపై ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు.

అంగన్‌వాడీ సమస్యల పరిష్కారానికి డిమాండ్



ఎన్నికైన నూతన కమిటీ

ఆత్మకూరురూరల్ : అంగన్‌వాడీ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాతమ్మ, సీఐటీయూ జిల్లా నాయకుడు గుజ్జుల శివప్రసాద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో అంగన్‌వాడీల ఆత్మకూరు ప్రాజెక్ట్ డివిజనల్ మహాసభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, వివిధ రకాల యాప్‌లను రద్దు చేయాలని, అందరికి ట్యాబ్‌లను ఇవ్వాలని కోరారు. గతంలో అంగన్‌వాడీల 42 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అనంతరం 17 మందితో కార్యదర్శి, వర్గ సభ్యులను, 20 మంది కమిటీ సభ్యులతో ప్రాజెక్ట్ కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ గౌరవాధ్యక్షుడిగా శివ ప్రసాద్, అధ్యక్షురాలిగా రమణమ్మ, కార్యదర్శిగా రాధమ్మ, కోశాధికారిగా రూతమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విజయభారతి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జమీల, ప్రచార కార్యదర్శిగా నాగరత్న, తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కొప్పోలు డేవిడ్‌రాజు, సీఐటీయూ ఆత్మకూరు కార్యదర్శి కొండమూరి హజరత్తయ్య, మండలాధ్యక్షుడు నాగయ్య, ప్రాజెక్ట్ పరిధిలోని 75 మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.